సరీసృపాలు

డాక్టర్. వి.చంద్రశేఖరరావు

ఆత్మహత్యలన్నీ సామాజిక విషాదాలే!

'పిరికి వెధవ! బ్రతుక్కి వెరిచాడు!' అని నిరసన వ్యక్తంచేసి ఆ సంఘటన నుంచి పారిపోవటం ఎంతమాత్రం సాధ్యంకాదు.

సురేంద్ర పొద్దున రూముకు వచ్చి "మోహన్రావు ఉరేసుకుని చనిపోయాడటరా!" అన్నప్పుడు మోహన్రావు ఎవరని వివరాలడగాలనిపించలేదు. ఈ చనిపోయిన కుర్రవాడితో నాకు బొత్తిగా ముఖ పరిచయం కూడా లేదే అని సరిపెట్టుకోలేక పోయాను.

విషాదం సమ్మెట దెబ్బలా గుండెపై దబ్బున తగిలింది. చనిపోవటం ఎంత బాధాకరమైన అనుభవం! అదే తనను తాను చంపుకోవటం. అది మోహన్రావైనా, మరో ప్రకాశరావైనా ఎంత హృదయవిదారకమైన విషయం!

క్యాంపస్ నిండా విద్యార్థులే. లైబ్రరీ ముందున్న చెట్టుకు లేలాడుతూంది మోహన్రావు శవం. చెట్టుపై నుండి శవాన్ని దించే ఏర్పాట్లు చేస్తున్నారు. తుపాకీ గుండు తాలూకు పెల్లెట్స్ తగిలి విలవిల లాడుతున్న పక్షుల్లా ఉన్నారు చుట్టూ మూగిన విద్యార్థులు. నునులేత స్వప్నానికి రక్త మాంసాలు కూరినట్టుగా మృదువుగా మనోహరంగా వుందా కుర్రవాడి శరీరం. పదిహేడేళ్ళ వయసు.

మోహనా! మోహనా! ఎంతపనిచేశావయ్యా!

శవాన్ని క్రిందకు దించారు. జేబులో ఏవో ఉత్తరాలున్నట్టున్నాయి. చివరి ఉత్తరమేమో?

"నాయనా!" అంటూ మొదలైంది ఉత్తరం.

"నేను వెళ్ళిపోతున్నాను. చాలా దూరం. బహుశా మీకు అందనంత దూరం. ధైర్యాన్ని పోగుచేసుకొని, ఈ ప్రపంచాన్ని వదిలి, హఠాత్తుగా బాట ఆగిపోయిన ప్రయాణీకుడిలా వెళ్ళిపోతున్నాను.

ఇది వీడ్కోలు కాదు. నిరసనగా మీ నుంచి నిష్క్రమిస్తున్నాను.

మూడు నెలలుగా చెబుతున్నాను. నేను పడుతున్న నరక యాతన. అది నీ చెవికెక్కలేదు. 'కొడుకు డాక్టరైనాడట్లే!' అనే విస్మయానందకరమైన పలకరింపులు చెవుల్లో గింగురు మంటూండగా కలల్లో తేలిపోయే నీకు నా గొంతులోని దుఃఖపు కేకలు వినబడనే లేదు.

పల్లె నుంచి పట్నానికి చేరినంత మాత్రాన నా స్థాయి ఏం పెరగలేదు. మెడికల్ కాలేజీలో చేరి భుజంపై తెల్లకోటు వేసినంత మాత్రాన నా నెత్తిన కిరీటం, నా భుజాలకు రెక్కలూ మొలవలేదు. అక్కడా యిక్కడా నేను దళితుణ్ణే. అన్‌టచ్‌బుల్నే.

"ఒరేయ్! కోటాగాడురా! ఏంబాసు! థర్టీ పర్సెంట్ బ్యాచా!"

"మోహన్రావా పేరు? ఏ మోహన్రావు? మోహన్రావు షె.కు నా? మోహన్రావు షె.జా నా?"

విన్నావా? ఈ మాటలు చెవిన బడకుండా నా చెవుల్లో సీసం కరిగించి పొయ్యటం మరిచిపొయ్యావు! మాటలకు కొంత ఎనర్జీ ఫాక్టర్ వుంటుందనీ అది పెను విస్ఫోటలా గుండెల్ని భగభగ లాడించగలదని నీకు తెలియదా?

ఎన్నో ఆశలతో యిక్కడకు వచ్చాను. ఇది నువ్వనుకున్నట్టుగా స్వర్గధామం కాదు. చిత్రహింసల కొలిమి.

వింటున్నావా?

ఏపాటి ధైర్యపు కవచాన్నీ, ప్రతిఘటనకు అవసరమైన కరకు గోళ్ళనూ పంజాలనూ యివ్వకుండా నన్నీ అరణ్యంలోకి త్రోశావు!

హాస్టల్ టెర్రస్ మీద, బట్టలన్నీ విప్పదీసి మెడలో చెప్పుల దండ వేసి "మీ బాంచన్ దొర కాల్మొక్త! కోటాగాణ్ణి! దయచూపండి!" అని ఎలుగెత్తి అరవటం; ఎట్లా వుంటుందా అనుభవం!

మనకీ పెద్ద చదువు లెందుకు, వద్దయ్యా, అన్నాను. విన్నావు కావు.

డాక్టరుగా నన్ను చూడాలని నీ కోరిక. ప్రాణాలరచేత బెట్టుకుని పులి గుహల్లాంటి కాలేజీలో తిరిగే ధైర్యం లేక చచ్చిపోతున్నాను. నన్ను క్షమించు! – మోహన్రావు.

* * *

అసెంబ్లీ హాలు. ఉక్కపోతగా వుంది. సంతాప సభ కోసం విద్యార్థులందరూ వచ్చారు. స్వర పంజరాల్లోంచి విడుదలైన నిట్టూర్పులు, దిగులు కబుర్లు, నిశ్శబ్ద విషాదం–వాతావరణం బరువుగా వుంది. ఒక మూలన గోడకు ఆనుకొని నిలబడ్డాను. నుదుటికి పట్టిన చెమటను తుడుచుకుంటూ సురేంద్ర వచ్చాడు.

"మోహన్రావు చనిపోయి గంటలైనా కాలేదు. అప్పుడే వాతావరణంలోకి రాజకీయపు వైరస్ చొరబడింది. ఎపిడిమిక్ కన్నా వేగంగా ప్రయాణించగల ప్రమాదకరమైనదీ వైరస్. ఎస్.సి., బి.సి.లను పోగుచెయ్యాలని ప్రయత్నిస్తున్నాడు దయానిధి. ప్రాణానికి ప్రాణం అని హింస రచన చేస్తున్నాడు. రాఘవరావు గ్రూపు ప్రస్తుతం మౌనంగా వున్నారు. కానీ అది తుఫాను ముందరి నిశ్శబ్దం అని అనుమానంగా వుంది" ఎప్పుడూ ఉల్లాసంగా వుండే సురేంద్ర

ముఖంలో కల్లోల మేఘాలు ముసిరాయి.

కళ్ళలో బోలెడంత దిగులును విషాదాన్ని నింపుకొని గొప్ప కేరెక్టర్ ఏక్టర్‌లా ప్రిన్సిపాల్ మైకు దగ్గరకు వచ్చాడు.

"ఎంతో భవిష్యత్తు వున్నవాడు పసివాడు ఇలాంటి దుర్మరణం పాలవటం గుండె తరుక్కుపోతుంది. ఎంచేతనో ఈ తరం యువకుల ఆలోచనా వ్యవస్థే సజావుగా లేదనిపిస్తుంది. మెదళ్ళనిండా భయం.

మోహన్రావు యిలా చెయ్యకుండా వుండాల్సింది. తల్లిదండ్రులకు ఎంత గుండెకోత...?"

"సానుభూతి సరే. ముందు హంతకులపై మీరు తీసుకోబోయే చర్య గురించి చెప్పండి!" ప్రిన్స్‌పాల్ మాటల్ని ఆపి వేస్తూ దయానిధి అరిచాడు. సన్నగా పొడుగ్గా రివటలా వుంటాడు. కోలముఖం. ఎప్పుడూ ఏదో భావావేశంతో రగులుతున్నట్టు వుంటుందా ముఖం. దయానిధి కాలేజీ స్టూడెంట్స్ యూనియన్ సెక్రటరీ కూడా.

దయానిధి మాటలకు ప్రిన్సిపాల్ కాస్త విసుగు ముఖం పెట్టి "ఇది సంతాప సభ" అన్నాడు. "అయితే ఏమిటి?" దయానిధితోపాటు మరో పది కంఠాలు తీవ్ర స్వరంతో అరిచాయి.

ప్రిన్సిపాల్ కాస్త తగ్గి "ఎవర్ని శిక్షించటము? తననెవరు ఏడిపించారో స్పష్టంగా రాయలేదు మోహన్రావు. వాళ్ళ పేర్లుగానీ ఆ ఉత్తరంలో వుండి వుంటే ఈ పాటికి వాళ్ళని డిస్మిస్ చేసేవాణ్ణి. ఆ దురదృష్టకరమైన రాత్రి ఆకాశము, మబ్బులు, చుక్కలు ఎక్స్‌ట్రా ఇనానిమేట్ ఆబ్జెక్ట్స్ తప్ప ఎవరూ లేరు. అవి సాక్ష్యం చెప్పలేవు" అన్నాడు నాటకీయంగా.

"సర్! ఆ రాత్రి ఆకాశము, మబ్బులు, చుక్కలతో పాటు మరో అయిదుగురు విద్యార్థులు కూడా ఉన్నారు ఆ రాగింగ్‌లో. శ్రీవారికి యిలాంటి ధర్మ సందేహం వస్తుందనే వాళ్ళు రిటన్ కంప్లైంట్ ఇచ్చారు. నిందితుల పేర్లు ఉన్నాయి. వెంటనే చర్య తీసుకోండి!" దయానిధి అరిచాడు.

"ఆ కంప్లైంట్‌లను నమ్మేదెట్లా? గిట్టని వాళ్ళని ఇరికించడానికి ఎవరో సృష్టించి వుండవచ్చుకదా! " రాఘవరావు రంగ ప్రవేశం చేశాడు. రాఘవరావు లాజిక్‌తో క్షణంపాటు అందరం దిమ్మెరపోయాము.

ప్రిన్స్‌పాల్ ముఖంపైని విషాదపు రంగు తుడిపేసుకొని అసహనాన్ని కోపాన్ని అభినయించటము మొదలుపెట్టాడు. "ఎంక్వైరీ కమిటీని వెయ్యండి!" పరిష్కారాన్ని సూచించాడు దయానిధి. ఆ సూచనను తిరస్కరిస్తున్నట్టుగా ప్రిన్సిపాల్ వేదిక దిగి వెళ్ళిపోయాడు. కాలేజీకి సెలవు ప్రకటిస్తూ వైస్ ప్రిన్సిపాల్ సభను ముగించాడు.

"ప్రిన్స్‌పాల్ డౌన్ డౌన్!" "హంతకులను శిక్షించాలి!" నినాదాలతో అసెంబ్లీ హాలు మారుమోగింది. రాఘవరావు యాభైకి పైగా ఉన్న తన పరివారంతో బయటకు వెళ్ళిపోయాడు. విద్యార్థులతో మాట్లాడాలని వేదికపైకి వచ్చాడు దయానిధి.

"పూర్వం దళితులు సంస్కృతం నేర్చుకున్నారని రాళ్ళతో కొట్టి చంపేవారట. స్వతంత్రం వచ్చిన నలభైయేళ్ళ తరువాత మళ్ళీ అదే పరిస్థితి. ఉన్నత విద్యలకు దళితులు పనికిరారు. పల్లెల్లో రైతు కూలీలుగానో, పట్టణాల్లో కార్మికుడిగానో ఆఫీసుల్లో చప్రాసీలుగానో. బ్రతకాలి. తెలివిగలిగిన ఒకరిద్దరు మోహన్రావులను ఇలా నిర్దయగా చంపి మిగిలిన వాళ్ళకు హెచ్చరిక చేసే కుట్ర యిది. ఈ కుట్రను భగ్నం చెయ్యాలి."

దయానిధి ఉపన్యాసం కొనసాగుతుండగా హాలు వదిలి బయటికొచ్చాను. సురేంద్ర దయానిధి ఉపన్యాసాన్ని సీరియస్‌గా వింటున్నట్టున్నాడు. అక్కడే వుండిపోయాడు.

కొలిమి నిప్పులా వుంది ఆకాశం. చెట్లు కదలటం మానివేశాయి. "అయ్యా! మా మోహన్రావు ఎక్కడయ్యా! మా బంగారు నాయన ఎక్కడయ్యా! మా అయ్య నేంచేసేరో చెప్పండయ్యా! నా తండ్రి! పుస్తకాలు తప్ప వేరే లోకం తెలియదు. మా నాయన్ని నాకు చూపించండయ్యా! అయ్యా! డాక్టరునై వచ్చి మనోళ్ళందరికీ ఫ్రీగా నయం చేస్తానే అనేవోడయ్యా! మాయదారి చదువు నా బిడ్డను పొట్ట బొట్టుకుందయ్యా! దేవుడా! నాకెందుకింత కడుపుకోత పెట్టావయ్యా! మోహనా! అయ్యా మోహనా!" శోకతప్తమైన మాతృమూర్తి రోదన గుండెల్ని పిండివేస్తూంది. అప్పుడే వాళ్ళ వూరు నుంచి వచ్చినట్లున్నారు.

గేటు దగ్గర పార్వతి ఎదురైంది. "మార్చ్యురీకి వెళుతున్నాను వస్తావా?" అంది. "ఎందుకో మనసంతా దిగులుగా, పచ్చి పుండులా వుంది. రూమ్ కెళతాను" అన్నాను. "అంత బేలవైతే ఎలా" పార్వతి ఓదార్పుగా అంది. గేటు దాటినాక యిద్దరం రెండు మార్గాల్లోకి చీలిపోయాము.

* * *

సాయంకాలం సుమారు ఏడు గంటలకు పార్వతి నా రూమ్ కొచ్చింది. బరువెక్కిన గుండెల్ని తేలిక పరుచుకొందామని నేనే పార్వతిని రమ్మన్నాను. పార్వతితో కాసేపు మాట్లాడితే పరిమళించే విరిదండమన పరిసరాల్లో గుప్పుమన్న హాయి కలుగుతుంది. గొప్ప సెన్సాఫ్ హ్యూమరుంది తనకు. ఎంచేతనో ఈ సాయంకాలం పార్వతి కూడా మూగబోయింది. "కొన్ని విషాదాలకు నిశ్శబ్దమే గొప్ప ఓదార్పు" అంది ఎందుకు మాట్లాడటం లేద అడిగితే.

కుల మతాల సరిహద్దుల్ని చెరిపివేసిన స్నేహం మా యిద్దరిది. కొత్తలో చాలా ప్రతి ఘటనని ఎదుర్కోవలసి వచ్చింది. "మా



అమ్మాయితో స్నేహం చేస్తావా?" అంటూ కాలర్ పట్టుకొన్నాడో సీనియర్. మా అమ్మాయి అంటే మా కులపు అమ్మాయి అని అర్థం. "స్నేహం టూవే ప్రాసెస్ కదా! కావాలంటే పార్వతిని విరోధించు!" అన్నాను. వాళ్ళతో పెద్దగా గొడవ పెట్టుకోకుండా పార్వతి చాలా ఇబ్బందుల్ని ఎదుర్కొంది. తండ్రి పరమేశ్వరరావు పరమ ఛాందసుడు. హిట్లర్ రావుగా సుప్రసిద్ధుడు. ముస్లిం కుర్రవాడితో స్నేహమా అంటూ హుంకరించాడు. "ఛాందసుడైన తండ్రి కన్నా సహృదయుడైన స్నేహితుడే ఎక్కువ నాకు. నాకీ కులాలపై బొత్తిగా నమ్మకం లేదు. కాదు కూడదంటే ఇస్లాం పుచ్చుకుంటాను" అంటూ బాంబు పేల్చింది. ఈ మొండిది ఎంతకైనా తగునంటూ తల్లిదండ్రులు పట్టుబట్టటం మానివేశారు.

ఎనిమిది గంటలకు సురేంద్ర వచ్చాడు. "మెస్ కెళ్ళి భోజనం చేద్దాం రండం"టూ.

వరండా బద్ధకంగా ఆవులిస్తున్న పులి నోరులా వుంది. వరండా మధ్యలోంచి మెస్ వైపుకు వెళ్ళడానికో కాలిబాట వుంది. కాలిబాటకు దగ్గరగా వున్న రూమ్ ముందు కర్టెన్ తొలగి నాలుగైదు అపరిచితమైన ముఖాలు తళుక్కుమన్నాయి. మొరటుగా, అనాగరికంగా వున్నాయి ఆ ముఖాలు. "లోకల్ గుండాల్ని ఎంగేజ్ చేశాడు రాఘవరావు" సురేంద్ర క్లూ అందించాడు.

డైనింగ్ టేబుళ్ళపై అందంగా పరిచిన టేబుల్ క్లాత్. దానిపైని వంటకాలు ఆహ్వాన పత్రికల్లా వున్నాయి. పది బల్లలు ఈ వైపుకు పది బల్లలు ఆ వైపుకు సర్ది వున్నాయి.

"ఒక్క రోజులోనే కలిసి తినడానికి ఇష్టపడనంత శతృత్వం పెరిగిందా? ఎంత దిగజారుతున్నాము మనం" పార్వతి తనదైన నిర్మొహమాటపు ధోరణిలో అంది. అప్పుడే లోపలికి వచ్చిన రాఘవరావు కరకుగా చూశాడు పార్వతి వైపు. రాఘవరావుతో పాటు మరో ఐదుగురు 'ఖల్‌నాయక్'లు కూడా మెస్‌లో కొచ్చారు. మా పక్కనున్న టేబుల్‌పైనే వాళ్ళూ కూర్చున్నారు.

పార్వతి వాక్ప్రవాహం ఆగలేదు. "స్టీఫెన్ స్పీల్ బర్గ్ సినిమా 'జ్యూరాసిక్ పార్క్' అని కొత్తగా వచ్చింది. వేలయేళ్ళ క్రితం చనిపోయిన సరీ స్రపాల్ని క్లోనింగ్ పరిశోధనలతో తిరిగి పుట్టించగలుగుతారు, జెనిటిక్ ఇంజనీరింగ్ శాస్త్రజ్ఞులు. వాటిని జ్యూరాసిక్ పార్క్ అనే ప్రత్యేక ప్రాంతంలో పెంచుతుంటారు.

అప్రమత్తంగా వున్న క్షణాల్లో జీన్ బాంక్‌లో వున్న అండాలన్నీ నేల పాలవుతాయి. అసంఖ్యాకంగా రాక్షస బల్లులు పుట్టుకొస్తాయి. అవి చూస్తుండగానే రాక్షసాకారానికి పెరుగుతాయి. పార్క్‌ను ధ్వంసం చేస్తాయి. శాస్త్రజ్ఞుల్ని చిటికెలో పొట్టన పెట్టుకుంటాయి. అవి ఏ ఆయుధానికీ చావవు. మరెలా అని ఆలోచిస్తే ఈ సరీస్రపాలకు తమ సంతతిని తామే చంపుకునే లక్షణం వుంది. వాటినలాగే వదిలేస్తే కొన్నాళ్ళకు ఒకదాన్ని ఒకటి చంపుకొంటూ అన్నీ సర్వనాశనం అవుతాయని తేలుస్తారు.

ఈ విద్వేషాలు, హింస చూస్తుంటే మనక్కూడా ఆ లక్షణాలు అబ్బినట్టున్నాయనిపిస్తుంది. భూమిపై మానవ సరీస్రపాలు అంతరించిపోడానికి అట్టే కాలం పట్టదేమోననిపిస్తుంది.'' వైరాగ్య ధోరణిలో పార్వతి చెప్తకుపోతూంది.

అసంకల్పితంగానే జేబులోని పెన్ తీసి టేబుల్ క్లాత్‌పై సరీస్రపాలు బొమ్మలు గీయటం ప్రారంభించాను. ఒక సరీస్రపానికి రాఘవరావు పోలికలు, మరో సరీస్రపానికి దయానిధి పోలికలు. 'సరీ స్రపాల యుగం మళ్ళీ వచ్చేసింది' అంటూ కాప్షన్ రాశాను. టేబుల్ క్లాత్‌పైని కారికేచర్ని పార్వతి కూడా ఎంజాయ్ చేస్తూంది.

"బల్లలపై ఇష్టమైన చెత్త రాతలు రాయడానికి ఇది నీ రూమ్ కాదు. మెస్ హాలు" రాఘవరావు గొంతు ఖంగుమంది.

"గోటు హెల్!" అంది పార్వతి నిర్లక్ష్యంగా. పెను కోపంతో ముందుకు వంగి రెండు చేతుల్తో టేబుల్ క్లాత్‌ని లాగివేశాడు రాఘవరావు. ప్లేట్లు, గ్లాసులు చిందరవందరగా నేలపై పడ్డాయి.

"రాఘవరావ్, డోంట్ బిహేవ్ లైకే రౌడీ షీటర్" అన్నాను కోపాన్ని అణచుకుంటూ.

అప్పటిదాకా టేబుల్‌పై మౌనంగా కూర్చున్న అపరిచితులు రంగంలోకి వచ్చారు. వాళ్ళల్లో ఒకడు రెండు చేతుల్తో నా చొక్కా కాలర్‌తో సహా నన్ను లేవదీసి బలంగా బయటకు తోశాడు. మరొకడు పార్వతిని రెక్క పుచ్చుకొని లాగాడు. నిగ్రహించుకోలేని ఆవేశం నాలో పొంగింది. విరిగిన కుర్చీ చెక్క నొకదాన్ని తీసుకొని వాళ్ళపైకి ఉరికాను. ఇద్దరు మనుషుల్ని కలిపి కుట్టినట్టుండే భారీ ఆకారాలు వాళ్ళవి.

అలసట వచ్చేదాకా నన్ను పిడిగుద్దులు గుద్ది, నేను నేలపై జారిపడగానే ఇనుప రాడ్ బయటకు తీశాడు. నన్ను కాపాడాలని సురేంద్ర పరిగెత్తుకుంటూ వచ్చాడు. సురేంద్ర నుదుటిపై రాడ్ దెబ్బ 'ఫట్'మంది. రక్తం ధారలు కట్టింది. "లంజకొడకా! ఆడు మనవాడురా!" రాఘవ కంగారుగా అరిచాడు.

"రౌడీల్ని దెచ్చారు. మన వాళ్ళని చంపేస్తున్నారు" అంటూ కేకలు పెట్టుకుంటూ దయానిధి రూము వైపుకు పరిగెత్తాడు ఒక ఫస్టియర్ కుర్రాడు. యుద్ధ కాహళితో





హాస్టల్ మారుమ్రోగింది. పార్వతి చెప్పిన సరీసృపాల యుగం వచ్చేసినట్లే వుంది. పద ఘట్టనలు మెస్ హాలు దాకా వచ్చాయి. ఈ జీవితానికిక చివరి క్షణాలు కాబోలు అనుకున్నాను. కానీ వచ్చింది పోలీసులు. లాఠీలు ఝుళిపిస్తూ మెస్ హాలును, వరండాను చుట్టుముట్టారు. ఎవరో పుణ్యాత్ముడు ఫోనుచేసినట్టుంది. దొరికిన వాళ్ళ నందర్నీ వాన్లలోకి కుక్కుతున్నారు పోలీసులు. ముసలి పోలీసు ఒకడు నన్నూ వేన్‌లోకి తోశాడు. వేన్లో కూర్చున్న నాకు పార్వతి గొంతు వినపడి ఉలిక్కిపడ్డాను.

"మీరతన్ని తీసుకు వెళ్ళడానికి వీల్లేదు. తల పగిలి రక్తస్రావం అయ్యి ప్రాణాపాయ స్థితిలో వున్నాడు. అతనికిప్పుడు అర్జంటుగా ట్రీట్‌మెంట్ యివ్వాలి. అతన్ని వదిలేయండి!"

"డోంట్ డిస్టర్బ్ అజ్! ట్రీట్‌మెంటు ఎక్స్‌ట్రా స్టేషన్‌కు వెళ్ళినాక చూసుకుంటాం. ఎక్కువగా వాగావంటే నిన్నూ లోపలికి తోస్తాను. గెట్ లాస్ట్!" ఎస్.ఐ. గొంతులా వుంది.

"ఇంపాజిబుల్! నా ప్రాణాల్ని తీశాకే అతన్ని మీరు అరెస్ట్ చెయ్యగలిగేది. ఐ డోంట్ కేర్ యువర్ లా అండ్ ఆర్డర్!" పార్వతి గొంతు రీసౌండింగ్ ఎఫెక్ట్‌తో హాస్టలంతా మార్మోగింది.

"ఓ.కే. ఓ.కే.! అతనికి ట్రీట్‌మెంట్ యిప్పించినాకే మాకు హాండోవర్ చేయండి!" యస్.ఐ. రాజీపడినట్టున్నాడు. పార్వతి, సురేంద్రను తన భుజంపై పడుకోబెట్టుకుని, మోసుకువెళ్తున్న దృశ్యాన్ని వాన్‌లోంచి చూడగలిగాను.

ముక్క వాసనతో, ఉచ్చ కంపుతో వమనం తెచ్చేలా వున్న విశాలమైన గదిలో మా అందరినీ వుంచారు. రౌడీ షీటర్స్‌ను మాత్రం వేరే చోటుకు తీసుకు వెళ్ళారు. ఎవ్వరమూ పెద్దగా మాట్లాడుకోలేదు. ఒక మూలకు వెళ్ళి నేలపై చతికిల బడ్డాను. ఎందుకో చెప్పలేనంత దిగులు వేసింది.

మాలో ఒకడి మరణానికి మేము స్పందించిన తీరు తలచుకుంటే జుగుప్సాకరంగా వుంది. రెండు కన్నీటి చుక్కలు, ఒక నిముషం మౌనం, ఏదీ లేదు. పశ్చాత్తాపం అసలే లేదు. కుల విద్వేషాల్తో ఒకళ్ళ నొకళ్ళు నరుక్కుని రక్తంతోనే మృతునికి సంతాపం చెప్పాలనే ఈ రాక్షస ప్రవృత్తి మాకెక్కడి నుంచి వచ్చింది?

దీపపు వెలుగులో జైలు గోడలపై మసి బొగ్గుతో గొగ్గిరి గొగ్గిరిగా రాసిన మాటలు నా దృష్టిన పడ్డాయి. "భగవంతుడా! నన్ను రక్షింము" –'రామయ్య వ్రాలు', అని రాసి వుంది గోడపై.

సరీసృపాలం అయి మమ్మల్ని మేము భక్షించుకోకుండా కాపాడే శక్తి కోసం ఎలుగెత్తి అరవాలనిపించింది.

హఠాత్తుగా నా దృష్టి పథంలో పార్వతి తళుక్కుమంది. క్షతగాత్రుడైన మిత్రుడి కోసం పార్వతి పోరాడిన తీరు గుర్తుకొచ్చింది. ఒక అభౌతికమైన ఓదార్పు ఏదో నన్ను చుట్టుముట్టసాగింది.

★

దీప విలాపము

భూనభంబులపై, మసిపూత పూసి
కసులు గప్పెడు కారు చీకటుల ద్రోలి
పున్నమిని వెల్గల తలంపులను వీడి
అంధకారాన ముసుగు దైన్యంబదేల?

దివ్వె యొక్కటి చిరువవ్వు నవ్వేనేని
కుదులుకొనియున్న చీకటి కొండలైన
కరిగి పున్నమి వెన్నెలల్ కాయుననుచు
తెలిసి వెలిగింపగా వెనుదీతురేల?

మదుల యందును హృదయపు గదులయందు
మసలుచున్నట్టి అంధతమంబు బాప
దీప్త లెగజిమ్ము మీ యింటి దీపములను
ఆదరింపక ఆర్పివేయంగనేల?

కలికి నవ్వులతోడ క్రొవ్వలపు సిరులు
గంపకెత్తుచు చిమ్మచీకటిపిశాచి
తరిమివైచెడు దీపకాంతలకు వింత
కరుణ చూపంగలేని మూర్ఖత్వమేల?

అఖిల విజ్ఞానములకు చిహ్నంబువేసు
ఘనతగూర్చెడు విజయకేతనము నేసు
ప్రాలుమాలక కరకమలాల దాల్చి
చీకటిని గెల్వ యుద్ధంబు సేయరేల?

– ఎం.పి. జానుకవి

సమయస్ఫూర్తి

సమయస్ఫూర్తి, చమత్కారం అనేవి కవులకు ఖ్యాతిని చేకూర్చే సాధనాలు. సుప్రసిద్ధ శతావధాని కీ.శే. గాడేపల్లి వీరరాఘవశాస్త్రి గారు గద్వాల సంస్థాన కవిగా ఉండే రోజుల్లో, గద్వాల రాజు ప్రతి సంవత్సరం కవి సమ్మేళనం ఏర్పాటు చేస్తూ ఉండేవారట.



ఒకసారి ఒకకవి "శార్ఙ్గంఘ్రిస్మరణ వలన సద్గతి గల్గున్" అని దుష్కర ప్రాసతో సమస్యనిచ్చి పూరించమన్నాడట కవులను. ఇది పూరించడం కష్టమని శాస్త్రిగారంటే, ఆ సభలోనే ఉన్న చెన్నారెడ్డిగారనే కవి నేను పూరిస్తానంటూ 'భార్గ్యాభకచలకైనను...'' అని మొదలుపెట్టి పూరించారట. అప్పుడు శాస్త్రిగారు 'భార్గ్యాభ' శబ్దంతప్పని, 'భార్గాభము' కావాలని ప్రాసపోయిందని అన్నారట. అప్పుడు చెన్నారెడ్డి గారు "అతిచాతుర్యము వైదికద్విజులకే అబ్జాసనుండిచ్చెగా"అన్నారట.

చెన్నారెడ్డిగారు 'వైదిక ద్విజ'శబ్దాన్ని బ్రాహ్మణ పక్షులు అన్న అర్థంలో ప్రయోగించినట్లుగా గ్రహించిన శాస్త్రిగారు వెంటనే–

"అతిచాతుర్యము వైదిక ద్విజులకే యబ్జాసనుండిచ్చెగా
గతి యుంకేమని ఖేదమొందకు, దివౌకః ప్రాధకల్లోలినీ
వితతోత్తుంగ తరంగ ఖేలన కలా విశ్రాంతి రాయంచకీ
క, తటాకంబుల గ్రుడ్డికొంగల కొగిన్ గల్గించునే యెన్నడేన్"

అన్నారట. అంటే బ్రహ్మ, ఆ అతిచాతుర్య శక్తిని ఉత్తుంగ తరంగాలు గల్గిన నదిలో విహరించే రాజహంసకు ఈయకుండా, చెఱువులో తిరిగే గుడ్డికొంగకు ఇస్తాడా? అనిఅర్థం.

దాంతో ఒక కన్ను గ్రుడ్డిదైన చెన్నారెడ్డి గారు చిన్నబుచ్చుకొన్నారట.

–దిట్టకవి శ్రీనివాసాచార్య ఎం.ఎ.